సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 13 । మే । 2023



అలసత్వం వహిస్తే చర్యలు

ప్రభుత్వ భవనాల పనులను పూర్తి చేసి రెండు వారాల్లోగా ఆయాశాఖలకు అప్పగించాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ ఆదేశించారు. -IIలో

విద్యుత్ శాఖకు ఫేక్ సర్టిఫికెట్స్ షాక్..!

విద్యుత్‌శాఖలో ఫేక్ సర్టిఫికెట్స్ కలకలం రేపాయి. ఆ శాఖకే షాక్ ఇచ్చి అడ్డదారిలో ఉద్యోగం సంపాదించిన ముగ్గురు అడ్డంగా బుక్కయ్యారు.



-IIలో

ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, కన్వీనర్, ప్రిన్సిపాల్ కె.సురేష్ తెలిపారు. పరీక్షకు హాజరైన భామిని ఈఎంఆర్ఎస్ విద్యార్థులు 60కి 60 మంది పాసయ్యారు. మెళియాపుట్టి విద్యార్థులు 57 మందికి 54 మంది ఉత్తీర్ణుల య్యారు. ఆయా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూస్‌రీల్

ఆదర్శపాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- డీఈఓ ఎస్. ప్రేమ్‌కుమార్

పార్వతీపురం టౌన్: ఆదర్శ పాఠశాలల్లో 2023 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. భామిని, కురుపాం, మునక్కాయవలస, పురోహితునివలసలలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేరేందుకు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకోవాలన్నారు. ఆదర్శ పాఠశాలల్లో ఆంగ్లంలో బోధన ఉంటుందని, ఉచిత విద్య అందుతుందన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ సీఎస్‌సీ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెంప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2021-22, 2022-23 విద్యాసంవత్సరాల్లో చదివి ఉండాలని, 2022-23 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్‌కు అర్హత కలిగి ఉండాలన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి. కళ్యాణచక్రవర్తి తెలిపారు. సివిల్, రాజీకి అర్హత గల క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల చట్టానికి సంబంధించిన కేసులతో పాటు ఇతర కేసులు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఇరువర్గాల వారి ఆమోదం మేరకే కేసులు రాజీ చేస్తామని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ విష్ణు చరణ్


పార్వతీపురం: ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అన్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ సభ్యులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఉద్యోగ సంఘాల జేఏసీ సభ్యులు కిశోర్, శ్రీరామమూర్తి, జి. నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

డీఐజీ పర్యటనతో తనిఖీలు

సీతంపేట: కొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ శుక్రవారం సీతంపేట మీదుగా వెళ్లారు. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహన తనిఖీలు చేపట్టారు. పీఎంఆర్‌సిని డీఐజీ సందర్శించారు. ఆయన వెంట శ్రీకాకుళం ఎస్పీ రాధిక, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్ఐ ఎ.నీలకంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మందుబాబుల చిందులు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



పాఠశాలలో పూటుగా మద్యం సేవించి బోర్లా పడుకున్న మందుబాబులు

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం ప్రభుత్వ పాఠశాలలో మందుబాబులు చిందులు వేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో గురువారం జరిగిన ఓ ఫంక్షన్‌కు వచ్చిన వారిలో కొందరు రాత్రిసమయంలో పాఠశాల తరగతి గది తాళాలను బద్దలు కొట్టారు. తరగతి గదిలోనే పూటుగా మద్యం సేవించి నిద్రలోకి జారుకున్నారు. మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ మహిళలు శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి చూసేసరికి కొందరు వ్యక్తులు మద్యంమత్తులో నిద్రించడాన్ని గుర్తించారు. పాఠశాల గదితో పాటు అక్కడి పరిసరాల్లో గ్లాసులు, ప్లేట్లు వేసి చిందరవందర చేశారు. సర్కారు బడులను బాగు చేసేందుకు ప్రభుత్వం కోట్లాదిరూపాయలు ఖర్చుచేస్తుంటే.. సర్వతీ నిలయంలో మందుబాబులు చిందులు వేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

భయంకరి విషాదం

అర్ధరాత్రి వేళ... తాగునీటికోసం వచ్చిన ఆరు ఏనుగుల గుంపులో నాలుగు ఏనుగులు విద్యుదాఘాతంతో చలనం లేకుండా పడిపోయాయి. ప్రమాదం నుంచి తప్పించుకున్న రెండు ఏనుగులు ఒక్క ఉదుటున పరుగు తీశాయి. కాస్త దూరం వెళ్లాక తమ మిత్రబృందం వెంటరాకపోవడాన్ని చూసి ఘీంకరించాయి. ఏనుగుల ఘీంకరింపును వేకువజామున గమనించిన స్థానికులు ఏదో హానికలిగిందని భావించారు. పంట పొలాల్లోకి పరుగుతీశారు. ఘటనా స్థలంలో నాలుగు ఏనుగుల కళేబరాలను చూసి కన్నీరుకార్చారు. ఓ వైపు ఏనుగులు.. మరోవైపు స్థానికుల రోదనలతో ఆ ప్రాంతమంతా కన్నీటిసంద్రమైంది.



విద్యుదాఘాతంతో మృతిచెందిన ఏనుగులను చూసి కన్నీరు పెడుతున్న స్థానిక మహిళలు

- మూడునెలల కింద ఒడిశా లఖేరీ అడువుల నుంచి ఆంధ్రాలోకి వచ్చిన ఆరు ఏనుగులు
- భామిని మండలం కాట్రగడ-బి వద్ద పంట పొలాల్లో తిష్ట
- గురువారం అర్ధరాత్రి దాటాక అక్కడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన ఏనుగుల గుంపు
- మృత్యువాత పడిన నాలుగు ఏనుగులు
- త్రుటిలో తప్పకున్న మరో రెండు
- సహచర ఏనుగుల మృతితో సమీప కొండపైకి చేరి ఘీంకారం
- ఘటనా స్థలాన్ని మూడు జిల్లాల డీఎఫ్‌ఓల పరిశీలన
- ప్రమాద స్థలంలోనే ఖననం

భామిని:

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ-బి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో సంచరించే ఆరు ఏనుగుల గుంపులో నాలుగు ఏనుగులు గురువారం అర్ధరాత్రి దాటాక విద్యుదాఘాతానికి గురయ్యాయి. అక్కడికక్కడే మృతిచెందాయి. పొలంగట్టు పక్కనే ఉన్న ట్రాన్స్‌పార్మర్‌కు ఒక వైపు మూడు ఏనుగులు, మరో వైపు ఒక ఏనుగు కళేబరం పడి ఉండడాన్ని చూసిన స్థానికులు చలించిపోయారు. నీటి కోసం వచ్చి ప్రమాదానికి గురైన తీరును చూసి కన్నీరు కార్చారు. పంట పొలాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా ఆరాధించబడే ఏనుగులు విగత జీవులుగా మారడంతో కన్నీటి పర్యంతమయ్యారు. తమ భాగ్యలక్ష్మిలు దూరమయ్యాయంటూ రోదించారు. ఏనుగుల కళేబరాలకు



ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్‌పై మట్టి నమూనాలు పరిశీలిస్తున్న కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి, డీఎఫ్‌ఓలు

భక్తిశ్రద్ధలతో పసుపుకుంకుమలు రాసి పూజలు చేశారు. అంతిమ వీడ్కోలు పలికారు. మూడు నెలలుగా కాట్రగడ-బి, పక్కుడుబద్ర గ్రామాల సమీపంలోని పొలాల్లో సంచరిస్తూ... నిత్యం తారసపడే ఏనుగుల మృతిని తట్టుకోలేకపోతున్నారు.

లఖేరి అడవుల నుంచి వచ్చి.. విగతజీవులుగా మారి..

ఒడిశాలోని లఖేరీ అడువుల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన కొత్తూరు-బత్తిలి రిజర్వుఫారెస్టులోకి ఆరు ఏనుగుల గుంపు ప్రవేశించింది. ఈ విషయం మరుసటి రోజున అటవీశాఖ ట్రాకర్స్ గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. భామిని మండలం పరిధిలోని కాట్రడగ-బి పరిసరాల్లో స్వేచ్ఛగా సంచరించడం ప్రారంభించాయి. ఆహారం, నీటి అవసరాల కోసం పక్కుడుభద్ర తోటల నుంచి కాట్రగడ-బి వద్దకు చేరుకున్నాయి. అక్కడి పంట పొలాల నుంచి తిరిగి వెళ్లే క్రమంలో ఏనుగుల గుంపులోని గున్న ఏనుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తన తొండంతో తాకింది. ఒక్కసారిగా 6.3 కేవీ విద్యుత్ ప్రసరించడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఈ క్రమంలో పిల్ల ఏనుగును అంటిపెట్టుకుని ఉన్న రెండు ఆడ ఏనుగులు, ఒక మగ ఏనుగుకూడా షాక్‌కు గురై మరణించాయి. మిగిలిన రెండు ఏనుగులు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. పక్కుడుభద్ర తోటల్లోకి పరుగుతీశాయి. సహచర గుంపును వీడిపోవడంతో ఘీంకారాలు మిన్నంటాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడం వల్లే ప్రమాదం జరిగినట్టు విశాఖ రేంజ్ వైల్డ్ లైఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు.

ప్రమాదవశాత్తు...

ఏనుగులు ప్రమాదశాత్తు మరణించినట్టు గుర్తించామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి శ్రీకంఠనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న మట్టి నమూనాలు, పిల్ల ఏనుగుతోపాటు, మిగిలిన ఏనుగుల కళేబరాలపై విద్యుత్ షాక్ కారణంగా ఏర్పడిన కాలిన గాయాలను గుర్తించారు. స్వతహాగా ఏనుగులు అవి సంచరిస్తున్న దారిలో డ్రిప్ పరికరాలను, నీటి మోటార్లు, బోర్లు వంటి యంత్రాలను ధ్వంసం చేస్తుంటాయని, ఆ క్రమంలోనే గున్న ఏనుగు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొండంతో తాకినట్టు ప్రాథమికంగా గుర్తించామని చీఫ్ కన్జర్వేటర్ తెలిపారు. అనుకోని విద్యుత్ ప్రమాదంతో ఒకేసారి నాలుగు ఏనుగులు మృతిచెందడం బాధగా ఉందన్నారు. ఘటనపై విచారణ చేస్తామని తెలిపారు. మిగిలిన ఏనుగుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ఘటనా స్థలం పరిశీలన

విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జిల్లా అటవీ శాఖాధికారులు వెంకటేష్, ప్రసూన, హారిక, అటవీ రేంజ్ అధికారులు ఎస్.తవిటినాయుడు, త్రినాథరావు, పి.వి.శాస్త్రి, రాజశేఖర్, సింధూ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాఖాపరమైన పర్యవేక్షణ చేపట్టారు.

ఆత్మీయ బంధం తలచుకుంటూ....

దాదాపు మూడు నెలలుగా గజరాజుల గుంపు ఇక్కడి జీడి, మామిడి తోటలు, పంటపొలాల్లో తిరుగుతూ వాటికి కావాల్సిన ఆహారం సేకరించుకుంటున్నాయి. నిత్యం జనావాసాలు సమీపంలోకి వస్తున్న ఈ ఏనుగుల గుంపుతో అక్కడి ప్రజలకు సఖ్యత ఏర్పడింది. దీంతో వారు పూజించే లక్ష్మి దేవిగా, గణపతి ప్రతిరూపాలుగా భావించారు. ఏనుగులకు ఆహారం, పండ్లు, నీటి వసతి ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఈ గుంపులో చిన్న ఏనుగు పిల్ల ఉండడంతో చూసేందుకు కుటుంబాలతో సహా పొలానికి వెళ్లేవారు. ఆ సమయంలోకూడా అవి ఎటువంటి హానీ చేయకపోవడంతో ప్రజలకు, ఏనుగుల మధ్య బంధం ఏర్పడింది. ఈ తరుణంలో గజరాజులు మరణ వార్తను విన్న స్థానికులు జీర్ణించుకోలేకపోయారు. ఘటనా స్థలానికి కుటుంబాలతో సహా చేరుకున్నారు. తమ మధ్య ఉన్న ఆత్మీయబంధాన్ని తలచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు.



ఏనుగుల మృతిని తట్టుకోలేక రోదిస్తున్న మహిళ

ఆ రెండు ఏనుగులతో జాగ్రత్త..

ఒకే గుంపులోని నాలుగు ఏనుగులు మృతిచెందడం, అవి కనిపించకపోవడంతో మిగిలిన రెండు ఏనుగులు భయంతో ఉన్నాయని, వాటిలో తెలియని అలజడి నెలకుందని, ఏ సమయంలోనైనా జనంపై దాడిచేసే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రెండుమూడు రోజుల పాటు పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్త వహించాలన్నారు. కవ్వింపుచర్యలకు పాల్పడవద్దన్నారు.

ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం..

ఏనుగుల గుంపు బొమ్మిక మిన్నారావు పొలం వద్ద మరణించడంతో అధికారులు అక్కడే వాటి కళేబరాలకు పోస్టుమార్టం చేయాలని నిర్ణయించారు. విశాఖ జంతుప్రదర్శనశాలకు చెందిన వైద్యాధికారి శ్రీనివాసరావు బృందం, భామిని తహసీల్దార్ ఎస్.అప్పారావుల నేతృత్వంలో పంచనామా, పోస్టుమార్టం చేపట్టారు. నాలుగు ఏనుగుల శరీరం నుంచి కిడ్నీలు, కాలేయం, గుండె తదితర శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. మిన్నారావు అనుమతితో అతని పొలంలో జేసీబీ సాయంతో భారీ గుంతను తీశారు. గజరాజుల మృతదేహాలను ఖనం చేసే క్రమంలో సంప్రదాయాలను పాటించారు. ఈ తరుణంలో ప్రజలతోపాటు అధికారులు ఉద్వేగానికి గురయ్యారు.



ఏనుగు కళేబారాన్ని పరీక్షిస్తున్న అటవీశాఖ అధికారులు

జంటగా వెళ్లడం వల్లే...

ఆరు ఏనుగుల గుంపులో ప్రమాదం నుంచి తప్పించుకున్నవి 'జంట' ఏనుగులు. అవి ఎటువైపు వెళ్లినా మిగిలిన నాలుగు ఏనుగులకు కాస్త దూరం పాటించేవి. ప్రమాదం సమయంలోనూ ఆ దూరం వల్లే ప్రాణాలతో బయటపడినట్టు స్థానికులు చెబుతున్నారు.



ఘటనా స్థలంలో గుమిగూడిన జనం

రూ.124 కోట్ల విలువైన పనులకు అవకాశం

- కలెక్టర్ నిషాంత్ కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో రూ.124 కోట్ల విలువైన పనులకు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనుల ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలన్నారు. జిల్లా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని.. ఈ నేపథ్యంలో పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. సచివాలయం పరిధిలో రూ.40 లక్షల విలువ వరకు పనులు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులకు బిల్లులు వెంటనే మంజూరవుతాయన్నారు. ప్రజాప్రతినిధులతో సంప్రదించి 83 సచివాలయాల పరిధిలో పనులు పక్కాగా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మంజూరైన 72 గంటల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన అగ్రిమెంట్, నామినేషన్, తదితర అంశాలు ఐదు రోజుల్లో మండలస్థాయి బృందం పూర్తి చేయాలన్నారు. మంజూరు చేసిన పనులు పూర్తయిన వెంటనే కొత్త పనులు ప్రతిపాదించాలని సూచించారు.

బిల్లులు అప్‌లోడ్ చేయడానికి 24/7 వ్యవస్థ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పనులకు పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి.. పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పనులకు సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి. విష్ణుచరణ్, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్లు జె. రామఅప్పలనాయుడు, హెచ్.శంకరరావు, ఎస్. సర్వేశ్వరరావు, జిల్లా ప్రజారోగ్య శాఖాధికారి కేజీఎన్. నరసింగరావు, డీఈలు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనంలో రామభద్రపురం టాప్

- ఉపాధి వేతనదారులకు రోజుకు 266 రూపాయల కూలి గిట్టుబాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న వేతనదారులు రూ. 260తో ద్వితీయ స్థానంలో రాజాం



కొండకెంగువలో ఉపాధి పనులకు ఉత్సాహంగా వెళ్తున్న వేతనదారులు

రామభద్రపురం: ఉపాధి హామీ వేతనదారులకు గరిష్ట వేతనం కల్పిస్తూ రామభద్రపురం మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఒక్కో వేతనదారుడికి సుమారుగా రోజుకు 266 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతోంది. జిల్లాలో 3.49 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 6.04 లక్షల మంది వేతనదారులున్నారు. వీరిలో రోజుకు సుమారు 2.40 లక్షల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నాయి. పనికావాలని కోరిన వారందరికీ ఉపాధి అధికారులు మంజూరు చేస్తున్నారు. ఈ క్రమంలో పీడీ, ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, క్షేత్ర సహాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ పనులు ఏవిధంగా చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందో వివరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం తూతూమంత్రంగా నిర్వహిస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే గరిష్ట వేతనం 272 రూపాయలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఒక్కో వేతనదారుడికి 266 రూపాయల వేతనం కల్పిస్తూ రామభద్రపురం మండలం టాప్‌లో ఉండగా.. రూ.260 వేతనం కల్పిస్తూ రాజాం మండలం రెండో స్థానంలో నిలిచింది. ఈక్రమంలోనే 228 రూపాయల వేతనం కల్పిస్తూ గరివిడి మండలం ఆఖరు స్థానంలో ఉంది. రామభద్రపురం మండలంలో 10,581 జాబ్‌కార్డులు ఉండగా అందులో ప్రస్తుతం 6 వేల మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు. రోజుకు సగటు వేతనం వస్తుండడంతో వీరంతా ఆనందం వ్యక్తం చేస్తునారు.

అక్రమాలకు తావులేకుండా..

ఉపాధిహామీ పథకంలో అక్రమాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి వేతనదారులకు గరిష్ట వేతనం 272 రూపాయలు కాగా.. రామభద్రపురం మండలంలో మాత్రం రూ. 266 పొందుతున్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే గరిష్ట వేతనం పొందే అవకాశం ఉంది.

– జనార్దన్, ఉపాధిహామీ ఏపీడీ, విజయనగరం

వికటించిన వివాహ భోజనం

- కొవ్వాడ అగ్రహారంలో కలుపితమైన పెళ్లి భోజనం
- సుమారు 400 మందికి అస్వస్థత
- అంబులెన్సుల్లో ఆస్పత్రులకు తరలింపు
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ, ఆర్డీఓ, డీఎస్పీ
- ఆహారం కలుపితం కావడంపై ఆరా
- ప్రాణహాని లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు




పూసపాటిరేగ పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న ఆర్డీఓ సూర్యకళ


పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ అగ్రహారం గ్రామంలో కోట్ల గురునాయుడు మనవడు వివాహ విందుకు అందరూ సందడిగా వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం చేశారు. కాసేపటికి కొందరు వాంతులు, విరేచనాలు, తలతిప్పడం వంటి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. అంతే... విందుకు హాజరైనవారందరిలోనూ అలజడిరేగింది. అస్వస్థతకు గురైనవారిని అంబులెన్సుల్లో పూసపాటిరేగ, సుందరపేట పీహెచ్‌సీలకు తరలించి వైద్యసేవలు అందించారు. సాధారణ స్థితిలో ఉన్న మరో 300 మందికి గ్రామంలోనే వైద్యశిబిరం నిర్వహించి వైద్యాధికారి రాజేష్‌వర్మ పర్యవేక్షణలో వైద్యబృందాలు వైద్య పరీక్షలు చేశాయి. ఎవరికీ ప్రాణహాని లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పిన్నింటి గోవిందరావు, కోట్ల లక్ష్మణరావు, పవన్, మిరప ఆదిలక్ష్మి, మిరప రోషన్‌కుమార్, కోట్ల సత్యం, జమ్ము సత్యనారాయణ, అల్లాడ శ్యామ్, వాశ్లె భరత్‌రాజు, వాశ్లె మోక్షిత్, సిమ్మల అప్పయ్యమ్మ, దేబార్కి గౌరి, దేబార్కి బార్గవి, సిమ్మల పైడమ్మ, సిమ్మల పవిత్ర, రమణమ్మ, సుంకర లక్ష్మణరావు, గంద్రేటి ఈశ్వరరావు, దేబార్కి తిరుమల ప్రసాదరావు తదితరులు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందారు. ప్రస్తుతం వారంతా కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు.

ఆహారం కలుషితం కావడంపై ఆరా

కొవ్వాడ అగ్రహారంలో వివాహ విందును ఆరగించి అస్వస్థతకు గురైన బాధితులను ఎమ్మెల్సీ సురేష్ బాబు, ఆర్డీఓ సూర్యకళ, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పరామర్శించారు. విందులో బిర్యాని, ఆహార పదార్థాలు ఎవరు తయారు చేశారు.. ఆహార సరుకులు ఎక్కడ నుంచి తెచ్చారు వంటి అంశాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదిక అందజేయాలని తహసీల్దార్ ఇ.భాస్కరావును ఆర్డీఓ సూర్యకళ ఆదేశించారు. ఆహార విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బిర్యాని అరగకపోవడం వల్లే అస్వస్థతకు గురైనట్టు వైద్యులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఎంపీడీఓ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు సహాయక చర్యలు చేపట్టారు.



పూసపాటిరేగ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫుడ్‌పాయిజన్ బాధితులు



కొవ్వాడ అగ్రహారంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

క్లుప్తంగా

14న రామనారాయణంలో హనుమజ్జయంతి వేడుకలు



రామనారాయణంలో 60 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 14న హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు నారాయణం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకాలు, స్నపనం, 8 గంటలకు లక్ష తమలపాకుల పూజ, సిందూరంతో ఆంజనేయస్వామికి సామూహిక సహస్రనామార్చన, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామన్నారు. రాత్రి 7 గంటలకు 60 అడుగుల అభయాంజనేయ స్వామికి మహా హారతి కార్యక్రమం చేపడతామని చెప్పారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు.

అదృశ్యమైన యువకుడు లభ్యం



సాయికుమార్‌ను బంధువులకు అప్పగిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు

మెరకముడిదాం: సత్ప్రవర్తన కలిగి ఉండాలని తల్లిదండ్రులు మందలించడంతో మండలంలోని భగీరథిపురం గ్రామానికి చెందిన ఆలుగుబిల్లుసాయికుమార్ మనస్తాపం చెంది ఈనెల 9 వతేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి పారిపోయాడు. దీంతో యువకుడి తల్లి లక్ష్మి బుదరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సీహెచ్.నవీన్‌పడాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో హెడ్‌కానిస్టేబుల్ వై.అప్పారావు ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా శుక్రవారం సాయంత్రం సాయికుమార్ విశాఖపట్నంలోని పెద్దమ్మ ఇంటివద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి సాయి కుమార్‌ను వెంటపెట్టుకుని తీసుకువచ్చి తల్లి దండ్రులకు అప్పగించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం వ్యాన్

పార్వతీపురం: ఒడిశా రాష్ట్రంలోని అలమండకు బొలెరో వాహనంలో అక్రమంగా రవాణాచేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పార్వతీపురం మండలం డోకిశీల గ్రామంనుంచి అలమండ గ్రామానికి 54 బస్తాలు (50 కిలోలు) బియ్యం తరలిస్తుండగా మండలంలోని రావికోన బట్టివలస గ్రామ సమీపంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో పట్టుబడిన బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని రూరల్ పోలీసులకు అప్పగించారు. దాడుల్లో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై శర్మ, ఎస్‌టీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ చెల్లింపుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్‌మిల్లు యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లింపుల్లో మృతి చెందిన కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె. రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2016 సంవత్సరం నుంచి చాలా మంది రిటైర్డు కార్మికులు అనారోగ్యంతో మృతి చెందారన్నారు. అటువంటి వారికి ప్రాధాన్యం ఇచ్చి గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. చెల్లింపుల్లో మిల్లు యాజ మాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఆందోళనకు దిగుతామని రామారావు హెచ్చరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 490.00
విజయనగరం	రూ. 494.00
శ్రీకాకుళం	రూ. 494.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	62,130–00
బంగారం(22సి. 10గ్రా.)	56,950–00
వెండి (కిలో)	82,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹139	₹248	₹ 258

పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్



హాజరైన వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు

విజయనగరం అర్బన్: వివిధ దశల్లో నిర్మాణం ఉన్న ప్రభుత్వ భవనాల పనులను పూర్తి చేసి రెండు వారాల్లోగా ఆయాశాఖలకు అప్పగించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో మరింత పురోగతి కనిపించాలని, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత కాలంలో చేరుకోవాలని సూచించారు. కారణాలు చెబుతూ కాలయాపన చేసే ఆలోచన నుంచి అధికారులు బయటకు రావాలని, సీరియస్‌గా తీసుకుని పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీ రాజ్ విభాగం, డీపీఓ, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక పనుల తీరుపై కలెక్టర్ ఆరా తీశారు. మండలాల వారీగా సమీక్ష నిర్వహిస్తూ లక్ష్యాలను చేరుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేయాలని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సులను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని, జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఓడీఎఫ్ పథకంలో భాగంగా పరిశుద్ధమైన గ్రామాలను తయారు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి నిర్దేశించారు.

ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలి

ఇప్పటి వరకు జిల్లాలో చేట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఆన్‌లైన్ ప్రక్రియలో అప్‌లోడ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీలైనంత అధిక మందికి ఉపాధి పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులపై ప్రత్యేక దృష్టి సారించి అధిక పనిదినాలు లభించేలా వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా గుర్తించి చెరువులను బాగు చేయాలని కొత్తగా గుర్తించి వాటికి ప్రతిపాదనలు పంపించాలని స్పష్టం చేశారు.

రెండు వారాల తరువాత మళ్లీ సమీక్ష

పంచాయతీ రాజ్ విభాగంలో చేపట్టిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను, వెల్‌నెస్ సెంటర్లను రెండు వారాల్లోగా అందుబాటులోకి తీసుకురావాల్సిందేనని కలెక్టర్ నాగలక్ష్మి కరాఖండిగా చెప్పారు. వివిధ దశల్లో ఉన్న వాటిని అప్‌డేట్ చేయాలని సూచించారు. భవనాల ప్రస్తుత దశల గురించి అడుగుతూ రెండూ వారాల్లోపు ఎన్నింటిని అప్పగించగలరని ఆరా తీశారు. అధికారులు చెప్పిన గడువు, భవనాల సంఖ్యలను కలెక్టర్ స్వయంగా డైరీలో నమోదు చేసుకున్నారు. రెండు వారాల తర్వాత ఈ లెక్కల ఆధారంగా మళ్లీ సమీక్ష నిర్వహిస్తానన్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, వాటిని సరి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికీ కుళాయి వేయాలని, అవసరాల మేరకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో శానిటరీ కాంప్లెక్సులను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి మంజూరు చేసిన పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక నుంచి సమీక్షలకు వచ్చేటప్పుడు పూర్తి అవగాహనతో రావాలని కొంతమంది అధికారులను ఉద్దేశించి కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ అశోక్‌కుమార్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ ఆర్‌ఎస్ గుప్తా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఉమాశంకర్, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, డీపీఓ శ్రీధర్‌రాజు, ఆయా శాఖల ఈఈలు, ఏఈలు, జేఈలు, ఎంపీడీఓలు, ఏపీడీలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న మంత్రి రాజన్నదొర

- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల ముఖాల్లో నిత్యం ఆనందం చూడడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమపథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే వారు చెబుతున్న సమస్యలను నోట్‌చేసుకుని కొన్ని సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను నెలకొల్పారన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పారదర్శకంగా పథకాలను వారింటికే అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని చెప్పారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ప్రధానంగా విద్య,వైద్య రంగాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలలో ఎన్నడూ లేని విధంగా పదవతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి స్టేట్ ఫస్ట్ వచ్చిందంటే ప్రభుత్వ విద్యలో జగనన్న ఎన్ని సంస్కరణలు తీసుకువచ్చారో తెలుసుకోవాలని హితవు పలికారు. నాడు–నేడు పనుల ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత జగనన్నదేనన్నారు. అంతే కాకుండా మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారన్నారు. తమ ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు.రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహనరెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమానికి ముందుగా డిప్యూటీ సీఎంకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు మయూరి అప్పలనాయుడు, మరడ సింహాచలం, వడ్డి చిన్నారావు, వడ్డి జనార్దన రావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు లెంక రత్నాకర్‌నాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోలేనిది

- లబ్ధిదారుల కృతజ్ఞతలు
- బ్లడ్‌క్యాన్సర్ బాధితురాలికి రూ.22 లక్షలు మంజూరు చేసిన సీఎం



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బ్లడ్ క్యాన్సర్ బాధితురాలు, ఆమె తండ్రి

రేగిడి:

అసలే నిరుపేద కుటుంబం, ఒక్కగానొక్క కుమార్తెను మంచి చదువు చదివించాలనే తపనతో పడుతున్న కష్టాన్ని కూడా మర్చిపోయారు. తమ కుమార్తె చదువు పూర్తయిన తరువాత పెళ్లిచేయాలనుకున్నారు. అయితే ఆమె ఎదుగుదలలో వచ్చిన మార్పులను గమనించి గత ఏడాది డిసెంబర్‌లో వైద్యులకు చూపించారు. ఆమెకు బ్లడ్ క్యాన్సర్ సోకిందని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా తల్లడిల్లిపోయారు. కుమార్తెను బతికించుకునేందుకు తిప్పని ఆస్పత్రి, మొక్కని దేవుడు లేడు. చివరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా ఆయన స్పందించి వైద్యం నిమిత్తం నిధులు మంజూరు చేయడంతో బాధిత కుటుంబం ఊరిపి పీల్చుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి సాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండల పరిధి రెడ్డిపేట గ్రామానికి చెందిన రెడ్డి సత్యవేణి (22) తిరుపతిలోని వెంకటేశ్వరయూనివర్సిటీలో పీజీ చేస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో వైద్య తనిఖీలు చేయడంతో ఆమె బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం బయటపడింది. విషయం తెలుసుకున్న వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ సత్యవేణితోపాటు ఆమె తండ్రి నారాయణరావు, తల్లి లక్ష్మితో కలసి ఈ నెల 11న విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చలించి రూ. 22 లక్షలు అందజేయాలని విశాఖపట్నం కలెక్టర్ మల్లికార్జునరెడ్డిని ఆదేశించారు. దీంతో సంతోషించి ఆ కుటుంబం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేనిదంటూ ముక్తకంఠంతో కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో పెళ్లి సందడి



వేపాడ-వల్లంపూడిలో పల్లకిలో పెళ్లికూతురి ఊరేగింపు

వేపాడ: పెళ్లిళ్ల సందడితో మండలంలోని పలు గ్రామాలు శుక్రవారం కళకళ లాడాయి. వల్లంపూడి, రాయుడుపేట, వేపాడ, కృష్ణారాయుడుపేట తదితర గ్రామాల్లో బంధువుల కోలాహలం నెలకొంది. పూర్వీకుల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వల్లంపూడి గ్రామంలో పల్లకిలో పెళ్లికూతురిని కూర్చుండెట్టి వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో ఊరేగించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న అప్పారావు, సాయి

పార్వతీపురం: మద్యం విషయంలో జరిగిన గొడవతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం చినగోడిజ గ్రామానికి చెందిన కొండగొర్రి అప్పారావును మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగవద్దని భార్య మందలించినందుకుగాను, ఆమె గాజులు పగులగొట్టి మందులో కలిపి తాగేశాడు. అదే సమయంలో భార్య సాయి కూడా తన గాజులు చితక్కొట్టి నీటిలో కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దంపతుల గొడవను గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రతిఫలాపేక్ష లేకుండా సేవ చేసేది నర్సులే



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రతిఫలం ఆశించకుండా సేవలు అందించేది నర్సులు మాత్రమేనని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల తర్వాత నర్సులకు మాత్రమే అంత గుర్తింపు ఉంటుందన్నారు. వైద్యులు, నర్సుల కృషి వల్ల వైద్య కళాశాలకు మిగతా కళాశాలల కంటే ముందుగా గుర్తింపు లభించిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. నర్సులకు ఓపిక, సహనం ఉండాలని స్పష్టం చేస్తూ సేవ లు అందించడంలో పోటీ పడాలని సూచించారు.

నర్సుల సేవలకు రేటింగ్

జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బి.గౌరీశంకర్ మాట్లాడుతూ రోగికి సంతృప్తికర సేవలు అందించాలని సూచించారు. రోగి డిశ్చార్జ్ అయిన తర్వాత నర్సులు అందించిన సేవలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రేటింగ్‌ను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా ఈవిధానం త్వరలో రానుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బొత్స సంతోష్, ఆర్‌ఎంఓలు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ సురేష్‌కుమార్, నర్సులు జ్యోతిర్మయి, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

నైటింగేల్ సేవలు స్ఫూర్తిదాయకం

భోగాపురం: నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ రోగులకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని సీహెచ్‌సీ వైద్యాధికారి పి.సునీల్ అన్నారు. శుక్రవారం నర్సు ల దినోత్సవం సందర్భంగా సుందరపేట సీహెచ్‌సీ లో డాక్టర్ సునీల్, సిబ్బంది ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న నర్సులందరూ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉత్తమమైన సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, శాలిని, వెంకటరమణ, స్టాఫ్‌నర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య



ఆస్పత్రిలో మృతిచెందిన గణేష్

బాడంగి: తల్లి దండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై డి.కొండలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలంలోని బొత్సవానివలస గ్రామానికి చెందిన అలజంగి నిర్మల, సుధల మొదటిసంతానం గణేష్(24) పాలిటెక్నిక్ చదువుకుని ఖాళీగా ఉంటూ అల్లరిచిల్లరగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ గురువారం రాత్రి పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు బాడంగి సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి నిర్మల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని ఏఎస్సై కొండలరావు చెప్పారు.

పెణసాంలో మరో యువకుడు..

గంట్యాడ: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన పురోహితుడు శ్రీనివాస రామశాస్త్రి (28) శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు వృద్ధులు. ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకున్నాడో తెలియరాలేదు. ఇదేవిషయాన్ని ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు వద్ద ప్రస్తావించగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న మాట వాస్తవమేనని, కుటుంబసభ్యులు ఇంకా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

హనుమాన్ శోభాయాత్ర రేపు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రామరాజు, పార్థసారథి, తదితరులు

విజయనగరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న విజయనగరం జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ రక్షా సమితి అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, పార్థసారథి తెలిపారు. నగరంలోని రింగ్‌రోడ్‌లో గల ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆ రోజు సాయంత్రం 4 గంటలకు నగరంలోని కోట జంక్షన్ నుంచి బయలుదేరనున్న శోభాయాత్ర మూడులాంతర్ల జంక్షన్, మెయిన్‌రోడ్, గంటస్తంభం జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయం జంక్షన్, ఎన్‌సీఎస్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్, మయూరి జంక్షన్, బాలాజీ జంక్షన్ మీదుగా తిరిగి కోట జంక్షన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ శోభాయాత్రలో 14 అడుగుల భారీ హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించనున్నామని, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోట జంక్షన్ వద్ద యాత్రను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారని, కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రాధామనోహర్‌దాస్ సహా పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొంటారని చెప్పారు. యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

నేటితో గడువు పూర్తి

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల ఏకైక హైస్కూల్ ఫర్ గరల్స్(జెడ్పీహెచ్‌ఎస్, ధర్మవరం, ఎస్ కోట మండలం)లో పనిచేయడానికి అర్హులైన, ఆసక్తిగల జిల్లా పరిషత్ యాజమాన్యాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తు చేసుకోవడానికి శనివారంతో గడువు ముగుస్తుందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. తెలుగు,ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు ఈనెల 13 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ కార్యాలయానికి సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా సీనియారిటీ మేరకు టెస్ట్, అర్హతల ప్రకారం హైస్కూల్ ప్లస్‌లో డిపార్ట్‌మెంట్ బేస్డ్ టెస్ట్‌లో ఒక అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ నియమించనున్నట్లు పేర్కొన్నారు. వారి ప్రమోషన్ చానల్ గానీ, సీనియారిటీ లెక్కించినప్పుడు గానీ ఆ కేడర్‌లో ఎటువంటి మార్పు ఉండదని తెలిపారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. 13వతేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

విద్యుత్ శాఖకు ఫేక్ సర్టిఫికెట్స్ షాక్..!

- తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన ముగ్గురు అభ్యర్థులు
- షిఫ్ట్ ఆపరేటర్, జెఎల్ఎంగ్రేడ్–2 ఇద్దరు తొలగింపు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్‌శాఖలో ఫేక్ సర్టిఫికెట్స్ కలకలం రేపాయి. ఆ శాఖకే షాక్ ఇచ్చి అడ్డదారిలో ఉద్యోగం సంపాదించిన ముగ్గురు అడ్డంగా బుక్కయ్యారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉద్యోగాల్లో చేరినట్లు విజిలెన్స్ విచారణలో తేలడంతో ఆ ముగ్గురినీ విద్యుత్‌శాఖ అధికారులు విధుల నుంచి తొలగించారు. చీపురుపల్లి మండలం విశ్వనాథపురానికి చెందిన రేవళ్ల కన్నంనాయుడు, గుర్ల మండలం గత్సవానివలస 33కేవీ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని మదన్ మోహన్ మాలవీయ విద్యాపీఠ్‌లో ఐటీఐ ఎలక్ట్రీషియన్ 2015లో చేసినట్లు సర్టిఫికెట్ సంపాదించి షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేరాడు. వాస్తవానికి మదన్ మోహన్ మాలవీయ విద్యాపీఠ్ 2012లో మూసివేశారు. దీనిపై విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు కన్నం నాయుడు చూపించిన సర్టిఫికెట్ ఫేక్ అని నిర్ధారించారు.

కేంద్రం గుర్తింపు లేని సంస్థలు

అలాగే నెల్లిమర్లలో ఎనర్జీ అసిస్టెంట్ (జూనియర్ లైన్ మేన్ గ్రేడ్–2) గా పనిచేస్తున్న అవనాపు రవితేజ ఇందిరాగాంధీ ఒకేషనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (సోహ్నా, ఉత్తరప్రదేశ్)లో ఐటీఐ ఎలక్ట్రీషన్ చదివినట్లు 2019లో చేపట్టిన ఎనర్జీ అసిస్టెంట్ నియామకాల్లో సర్టిఫికెట్ సమర్పించాడు. అలాగే డెంకాడ సెక్షన్‌లో ఎనర్జీ అసిస్టెంట్‌గా గుడివాడ అప్పలనారాయణ పనిచేస్తున్నాడు. అప్పలనారాయణ దయాల్ బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆగ్రాలో ఐటీఐ ఎలక్ట్రీషియన్ చదివినట్లు 2019లో జరిగిన నియామకాల్లో నకిలీ సర్టిఫికెట్ సమర్పించాడు. వారు చదివినట్లు చెబుతున్న విద్యాసంస్థలు సంబంధిత రాష్ట్రానివేగాని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్, గవర్న్‌మెంట్ ఆఫ్ ఇండియా గుర్తింపు లేనట్లు విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో తేలింది. దీంతో వారి అపాయింట్‌మెంట్స్ రద్దు చేయాలని విజిలెన్స్ అధికారులు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ఇదేవిషయాన్ని విద్యుత్‌శాఖ ఎస్.ఈ పి. నాగేశ్వరావు వద్ద సాక్షి ప్రస్తావించగా షిఫ్ట్ ఆపరేటర్ కన్నంనాయుడు, ఎనర్జీ అసిస్టెంట్స్ రవితేజ, అప్పలనారాయణలను విధుల నుంచి తొలిగించినట్లు చెప్పారు.